ప్రజాశక్తి
శుక్రవారం 22 మార్చి 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



పెత్తందారుల దాడిలో గాయపడిన దళితుడిని పరామర్శిస్తున్న కెవిపిఎస్ నేతలు

దళితుడిపై పెత్తందారుల దాడి

- మురుగునీటిని అడ్డగించారని ఫిర్యాదు చేసినందుకే..
- బాధితుడిని పరామర్శించిన కెవిపిఎస్ నేతలు

8లో



గాయపడిన విద్యార్థి

దళిత విద్యార్థిపై అధ్యాపకుడి దాడి

పరామర్శించిన ఎస్ఎఫ్ఐ నేతలు

3లో

పోలింగ్ గడువు దూరం..

ఖర్చేమో భారం..!



- అప్పటివరకూ శిబిరాలు నడిపేదెలా..?
- పార్టీల అభ్యర్థుల్లో పెరుగుతున్న ఆర్థిక వ్యయ భయం
- కొందరు వేగం.. మరికొందరు మందకొడిగా ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పోలింగ్‌కు గడువు చాలా రోజులు ఉంది. ఆఖరు దశలో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయి. మే నెలలో ఎన్నికలు జరుగుతాయి. అప్పటి వరకూ కోడ్ అమలులో ఉంది. ఏప్రిల్ నాలుగో వారం వరకూ ఖాళీగానే గడపాలి. ఎన్నికల ప్రచారాలతోనే సాగాల్సి ఉంది. నోటిఫికేషన్ ఇచ్చాకే నామినేషన్ల పర్వం మొదలుకానుంది. అయితే చాలా సమయం ఉన్నందున అభ్యర్థులు కొందరు గందరగోళం గా ఉన్నారు. కొందరు పార్టీ శిబిరాలు నడపడానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పటిదాకా ఎన్నికల శిబిరాలను నడపడానికి ఆర్థిక వ్యయం తడిసి మోపెడవుతుందని భావిస్తున్నారు. అందుకే ఖర్చుల విషయంలో జాగ్రత్తగా ముందుకు పోతున్నారు. కానుకలు తప్ప నగదు పంపిణీకి వెనక్కు తగ్గుతున్నారు.

పోలింగ్ గడువు చాలా దూరం పెట్టడం ఎవరికి నష్టం.. ఎవరికి లాభం అనే విశ్లేషణలు కూడా సాగుతున్నాయి. ఆఖరి దశలో పోలింగ్ పెట్టారు. దీని వల్ల అధికార పార్టీకే ఇబ్బందిగా భావిస్తున్నారు. నిన్నటివరకూ తమ చెప్పు చేతల్లో ఉన్న అధికారులు ఇప్పుడు ఎన్నికల కమిషన్ ఆధీనంలోకి వెళ్లారు. అధికారిక కార్యక్రమాలన్నీ ఆగిపోయాయి. అధికారులపై పెత్తనం కూడా లేకుండా పోయింది. మరోవైపు నిఘా వ్యవస్థలూ రంగంలోకి వచ్చాయి. ఏం చేయాలన్నా నిన్నటివరకూ అధికారుల సహకారం వైసిపికి ఉంది. ఇప్పుడు పాక్షికంగానే ఉంటుందని భావించాలి. పోలీసు యంత్రాంగం మాత్రం వైసిపి నేతలకు అనుకూలంగా ఉందనే చర్చ సాగుతోంది. తెలుగుదేశం ఫిర్యాదులపై స్పందన తక్కువగా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిలకలూరిపేట సభలో బందోబస్తుపై ఇప్పటికే తెలుగుదేశం నేతలు విమర్శల దాడి ▶ 2లో

రైతులకు సాయమేదీ..?

- ప్రకటనకే పరిమితమైన పెట్టుబడి రాయితీ
- కర్షకుల ఖాతాల్లో పడని రూ.104.73 కోట్లు..



ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కును రైతులకు అందజేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మిచౌంగ్ తుపానుతో తీవ్రంగా నష్టపోయిన జిల్లాలోని రైతులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల 6న తుపానుతో పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం పంపిణీ కార్యక్రమం జరిగింది. జిల్లాలో నష్టపోయిన రైతులకు రూ.104.73 కోట్ల పెట్టుబడి రాయితీ నగదును రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు రైతులకు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధులతో కలిసి కలెక్టర్ చెక్కు రూపంలో రైతులకు నగదు పంపిణీ చేశారు. అయితే నేటి వరకు కూడా సదరు నగదు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. జిల్లాలో గత డిసెంబరు నెలలో సంభవించిన తుపాను కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. తక్షణమే పంటనష్టం అంచనాలు రూపొందించి త్వరితంగా పంటనష్ట పరిహారం అందిస్తామని రాష్ట్రప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖాధికారులు హడావుడిగా నివేదికలు రూపొందించారు. అయితే ముందు తయారుచేసిన పంటనష్టం అంచనాలకు, తుది నివేదికకు పొంతన లేకుండా పోయింది. తుపాను తరువాత జరిపిన పంటనష్టం అంచనాల ప్రకారం జిల్లాలో 3,33,300 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, ఇందులో 1,98,535 ఎకరాల్లో వరిపైరుకు, 1,34,765 ఎకరాల్లో ఇతర పంటలకు నష్టం వాటిల్లినట్లు తేల్చారు. తుపాను కారణంగా జిల్లాలో 1,84,488 మంది రైతులు పంట నష్టపోయినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రూ.149 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రతిపాదనలు పంపారు. తుపాను కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు వచ్చిన కేంద్రబృందానికి కూడా ఇదే నివేదిక ఇచ్చారు. కానీ రాష్ట్రప్రభుత్వం నుంచి వచ్చిన మధ్యంతర ఆదేశాల మేరకు పంటనష్టం అంచనాలను కుదించారు. జిల్లాలో 1,17,960 ఎకరాల్లో వరి పంటకు, 25,452 ఎకరాల్లో ఇతర పంటలకు మొత్తంగా 1,43,412 ఎకరాల్లో మాత్రమే పంటలకు నష్టం వాటిల్లినట్లు తేల్చారు. ఈ మేరకు 81,965 మంది రైతులు మాత్రమే రూ.91 కోట్లు నష్టపోయినట్లు తేల్చారు. నష్టపోయిన రైతుల నుంచి నిరసనలు రావడం, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విన్నపాల మేరకు జిల్లాలో 1,61,585 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు తుపాను ప్రభావంతో దెబ్బతిన్నాయని, తుపాను విపత్తుతో పంట దిగుబడులు తగ్గిపోయాయని చెప్పిన ప్రభుత్వం ఈ మేరకు జిల్లాలో 93,471 మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు లెక్కలు తేల్చింది. వారందరికీ పెట్టుబడి రాయితీ కింద రూ.104.73 కోట్ల పెట్టుబడి రాయితీ నగదును రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తున్నట్లు తెలిపారు. మూడు వారాలుగా పంట ▶ 2లో

నాగులుప్పలపాడులో భారీ వర్షం

- తడిసిన శనగ ఓదెలు, పొగాకు..
- రైతుల్లో ఆందోళన



భారీవర్షానికి తడిసిన శనగ ఓదెలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

బుధవారం అర్ధరాత్రి ఒక్కసారిగా మండలంలో కొన్ని గ్రామాల్లో భారీ వర్షం కరిసింది. దీంతో రైతాంగం ఆందోళనకు గురయ్యారు. పంటలను కాపాడుకోవడానికి పరుగులు తీశారు. ఈ ఏడాది ఆది నుంచి వ్యవసాయం ఒడిదుడుకులతోనే ప్రారంభమైంది. ఒక పక్క వర్షాభావం వెంటాడింది. దీంతో వ్యవసాయం ఆలస్యమైంది. అది తట్టుకొని రైతన్నలు ముందుకు సాగారు. డిసెంబరులో తుపాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. తిరిగి మరికొంత ఆలస్యమైనా శనగ, పొగాకు, మినుము తదితర పంటలను సాగు చేశారు. పంటలు ఏపుగా ఉండడంతో మంచి ఫలితాలు వస్తాయని రైతులు ఆశించారు. ఈ నేపథ్యంలో శనగ పంటకు తెగుళ్లు వెంటాడంతో రైతన్నలు తల్లడిల్లిపోయారు. దీంతో దిగుబడులు తగ్గాయి. వాటిని తట్టుకొని ముందుకు సాగారు. మండలంలో శనగ 15 వేల ఎకరాల్లో సాగు చేశారు. కొంతభాగం కోతకోసి నూర్పిళ్లు జరగగా కొంతభాగం కోతకోసి ఓదెల మీద ఉంది. మరికొంత కోతదశలో ఉంది. ఇన్ని ఒడిదుడుకులు ఎదుర్కొని ఆరుగాలం కష్టించి కొద్దిపంట అయినా చేతికి వచ్చేసరికి అకాల వర్షంతో ఓదెలు తడిసిపోయాయి. దీంతో శనగ రంగు మారుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంతటితో వర్షం పోతే పెద్ద నష్టం ఉండదని రైతులు అంటున్నారు. మిర్చిని 5 వేల ఎకరాల్లో రైతులు సాగుచేశారు. ఆ పంటకు మొదటి నుంచి ఆటంకాలు ఎదురయ్యాయి. నీటి కోసం పోరాటం చేశారు. గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోవడంతో నీరు అంతా సముద్రం పాలవడంతో మిర్చి పంటకు ఒక్క తడి కూడా నీరు అందని పరిస్థితి నెలకొంది. దాంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఈ నేపథ్యంలో చేతికి అందివచ్చిన పంట ఇంటికి చేరుతుందని తరుణంలో అకాలవర్షం రైతాంగాన్ని కుంగదీసింది. కల్లాల్లో పంటను కాపాడుకోవడానికి పరదాలతో పరుగులు తీశారు. ఈ అకాల వర్షంతో మిర్చి, పొగాకు రంగు మారతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గెలుపు కోసం ఐక్యంగా కృషి చేయాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం

కనిగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని పలువురు తెలుగుదేశం నాయకులు కనిగిరిలోని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. మండలంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. రాబోయే ఎన్నికలలో ఐక్యంగా పనిచేసి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. అలాగే ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయకూడదని అన్నారు. తమ శాయశక్తుల పని చేయాలని సూచించారు. మండల టిడిపి అధ్యక్షులు బొమ్మనబోయిన వెంగయ్య, సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్నమాల కొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, రామకృష్ణంరాజు, బొబ్బూరి రమేష్, దొర తిరుపతయ్య, సారి వెంకటసుబ్బయ్య, కోనంకి వెంకటకొండయ్య, పోకల మాల్యాద్రి, తంగెళ్ల శ్రీనివాసులు తదితరులున్నారు.

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర



టిడిపి నాయకులతో మాట్లాడుతున్న ఉగ్ర

టిడిపితోనే బిసిల అభివృద్ధి

దర్శి: టిడిపిలోనే బిసిల అభివృద్ధి జరుగుతుందని టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోరంట్ల రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి బిసి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు బిసి అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. టిడిపి అధికారంలోనికి వస్తేనే బిసిలు అభివృద్ధి చెందుతారన్నారు. చంద్రబాబునాయుడు సిఎంగా ఉన్న సమయంలోనే బిసిలకు సమన్యాయం జరిగిందని దర్శి మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు అన్నారు. చంద్రబాబునాయుడు సిఎంగా ఉన్న సమయంలో బిసిలకు ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టారని, వాటిని వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టౌన్ పార్టీ అధ్యక్షులు యాదగిరి వాసు, నాయకులు మారెళ్ల వెంకటేశ్వర్లు, బెళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో జైలు

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరికి చెందిన షేక్ నాయబ్ రసూల్ ముదిరెడ్డి చలమారెడ్డి అనే వ్యక్తి నుంచి రూ.2 లక్షలు అప్పు తీసుకొని దాని తాలూకు సంబంధించి రూ.2,96,000 ఒక చెక్కును ఇచ్చారు. అది బౌన్స్ అయ్యింది. ఈ కేసు ఏడు సంవత్సరాలుగా విచారణ జరిగి గురువారం కనిగిరి కోర్టు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి కె భరత్‌చంద్ర వద్దకు రాగా నిందితుడు నాయబ్ రసూల్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ.2,96,000 నష్ట పరిహారం విధిస్తూ తీర్పు చెప్పారు.

పోలింగ్ గడువు దూరం.. ఖర్చేమో భారం.!

(మొదటిపేజీ తరువాయి)

పెంచారు. జిల్లా ఎస్పీపైనా దృష్టి సారించారు. అంటే యంత్రాంగం మార్పులుచేర్పులకు వ్యూహాలు మొదలుపెట్టారు. ఇక తెలుగుదేశం ఇంకా ఉమ్మడి ప్రకాశంలో దర్శి, చీరాల నియోజకవర్గాలకు అభ్యర్థులను కూడా ఖరారు చేయలేదు. అభ్యర్థుల ఎంపికపై కొంత కసరత్తు చేసుకోవడానికి, ఇతర పార్టీల నుంచి బలమైన నేతలు వచ్చేందుకు ఈ పార్టీకి కొంత అవకాశం వచ్చింది. కోడ్ వచ్చినందున వైసిపి నుంచి బలమైన నేతల కోసం ఆరా తీస్తున్నారు. ఎందుకంటే కోడ్ లేకుంటే కొందరు బయటకు రావడానికి ఇబ్బందిగా ఉన్నారు. ఎక్కువ సయయం ఉన్నందున తెలుగుదేశం పార్టీకి మేలు జరుగుతుందని భావిస్తున్నారు. అధికారుల ఆంక్షలు లేకుండా ఎక్కువ సమయం వచ్చినందున దీన్ని సానుకూలంగా మార్చుకునే యత్నం చేస్తున్నారు. ఆఖరు దశకు నెట్టడం వల్ల పాలకపక్షం పాత్ర ప్రాధాన్యత తగ్గుతుందని భావిస్తున్నారు. కలెక్టర్లు, ఎస్పీలపై పాలకపక్షం పెత్తనం తగ్గితే ఎన్నికల్లో ప్రతిపక్షానికు మేలు జరుగుతుంది. హడావుడిగా జరిగితే ఇప్పుడున్న అధికారులు పాలకపక్షానికి ఎక్కువ మేలు చేస్తారనే అంచనాల్లో ఉన్నారు. ఫిర్యాదులకూ అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ప్రచారం, ఎన్నికల వ్యూహాల విషయానికి వస్తే ముందుగానే అభ్యర్థిత్వం ఖరారైన కొందరు హడావుడిగా నియోజకవర్గాల్లో ప్రచారాలు మొదలుపెట్టారు. కోడ్ రావడంతో పాటు పోలింగుకు చాలా సమయం ఉన్నందున ఇప్పుడు వాళ్లంతా కొంత వేగం తగ్గించారు. సాదాసీదా వ్యవహారాలతో కాలం గడుపుతున్నారు. కొందరు ఇంకా సమయం ఉంది కదా అనే భావనలోనే ఉన్నారు. రోజూ నియోజకవర్గాల్లో పర్యటనలు కనిపించడం లేదు. ఆత్మీయ సమ్మేళనాలు, సామాజిక తరగతుల భేటీలు, పరిచయ కార్యక్రమాలు, అసమ్మతులతో భేటీలు, చేరికలు, సర్దుబాట్లు.. వంటివి సాగుతున్నాయి. నియోజకవర్గాల్లో సాదాసీదా కార్యక్రమాలకు కొందరు హాజరవుతున్నారు. శుభ కార్యక్రమాలు, కుటుంబ కార్యక్రమాలకు కొందరు హాజరవుతున్నారు. వైసిపి అభ్యర్థులు అందరూ కొత్త నియోజవర్గాల్లో పోటీ చేయడం వల్ల వారికి కూడా కొంత పరిచయ కార్యక్రమాలకు కాలం కలిసి వచ్చింది. ఇదొక్కటి మాత్రం వారికి ఊరటగా కనిపిస్తోంది. మొత్తంగా చూసుకుంటే పాలకపక్షానికి పోలింగ్ సమయం ఎక్కువ దూరంలో ఉండటం నష్టంగానే భావిస్తున్నారు. ఇక ఆర్థిక వ్యయం వెంటాడుతోంది. ఇప్పటి నుంచే కొందరు ఏ ఊరికి పోతే ఆ ఊళ్లో భోజనాలు పెడుతున్నారు. ప్రచారానికి మద్యంతో పాటు సభలకు జనాన్ని తరలించాలంటే డబ్బులు ఇవ్వక తప్పడం లేదు. రెండు పార్టీల్లోనూ జనానికి ఇలా అలవాటు చేశారు. పనులు మానుకొని వస్తే వాళ్లకు కూలికి సరిపడా ఇవ్వాల్సి వస్తోంది. శిబిరాలు నడవాలంటే రోజుకు రూ.లక్షకు పైనే కావాలంటున్నారు. కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నేతలు కూడా రోజూ అభ్యర్థుల ఇళ్ల వద్దకు ఉదయాన్నే వెళ్లి ఎంతో కొంత ఇస్తేనే కదా.. నడిచేది.. అనే భావనతో ఎదురుచూస్తున్నారు. అయితే అభ్యర్థులు మాత్రం ఆచీతూచీ ఖర్చు పెడుతున్నారు. ఇప్పటి నుంచే వదిలితే పోలింగ్ నాటికి దివాలా తీయడం ఖాయమనే ఆందోళనలో ఉన్నారు. పార్టీ అధిష్ఠానాలపై ఆధారపడ్డ అభ్యర్థులు కొందరున్నారు. వీళ్ల శిబిరాలు నడపడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఏదేమైనా పోలింగు చాలా దూరంలో ఉన్నందున కొందరు నియోజకవర్గాల్లో కనిపించడం లేదు. ఇప్పుడు ఎంత పెట్టినా లాభం తక్కువేనన్న చర్చ కూడా లేకపోలేదు. ఆఖరులో ఓటర్లకు ఇవ్వడంపైనే దృష్టి సారించారు.

రైతులకు సాయమేదీ.?

(మొదటిపేజీ తరువాయి)

నష్టపోయిన రైతులు నష్టపరిహారం తమ బ్యాంకు ఖాతాలో జమ అయిందేమోనని రోజూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. నగదు జమ కాకపోవడంతో వ్యవసాయాధికారులను ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఏమి చెప్పాలో అర్థం కాక త్వరలోనే వస్తాయని చెబుతున్నారు. తుపాను తరువాత తిరిగి పంటల సాగు చేపట్టిన రైతులు ప్రభుత్వం నుంచి పెట్టుబడి రాయితీ అయినా వస్తుందన్న ఆశతో సాగు చేపట్టారు. కానీ కాలం గడుస్తుందే గానీ రైతుల ఖాతాల్లో మాత్రం నగదు జమ కాకపోవడంతో ఎదురుచూపులు తప్పలేదు.

నల్లూరి రామస్వామికి నివాళి

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని పెదకొత్తపల్లి గ్రామంలో గురువారం మాజీ ఎంపీటీసీ మాజీ సర్పంచ్ నల్లూరి రామస్వామి 14వ వర్ధంతి కార్యక్రమం ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. సిపిఐ జెండాను ఆ పార్టీ సీనియర్ నాయకులు నల్లజర్ల సుబ్బారావు ఆవిష్కరించారు. అనంతరం కామ్రేడ్ నల్లూరి రామస్వామి విగ్రహానికి వారి సతీమణి నల్లూరి అన్నపూర్ణ, జిల్లా సీపీఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు సీపీఐ అభిమాని నల్లూరి సంజీవరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

నేటి నుంచి దద్దాల పర్యటన

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

వైసిపి కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సిఎస్ పురం మండలంలో పర్యటిస్తారని వైసిపి మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య తెలిపారు. పర్యటనను జయప్రదం చేయాలని నాయకులను, కార్యకర్తలను కోరారు.

కొత్త ఓట్లకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం

ప్రతి ఒక్కరూ కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సెంట్రల్ ఆంధ్ర కార్యక్రమాల కమిటీ సభ్యులు మాదాసు రమేష్ తెలిపారు. మండలంలో బూత్ కమిటీలు కొత్త ఓటర్ల నమోదు బూత్‌కు వెళ్లి ఓటు వేయలేని వికలాంగులు మరియు వృద్ధులకి ఫారం 12డి దరఖాస్తు మొదలైన వాటి గురించి ప్రతి బూత్‌కి తిరిగి వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉల్లిపాయల సుబ్బారాయుడు, సంగిశెట్టి శ్రీనివాస్, సాయి, సుబ్బారావు, మహేష్, రాము, వాసు తదితరులు పాల్గొన్నారు.

తిరిగి వైసీపీ గూటికి చేరిన సర్పంచ్

ప్రజాశక్తి - గిద్దలూరు

మండలంలోని కొంగలవీడు సర్పంచ్ పందనబోయిన లక్ష్మి ప్రసన్న గురువారం గిద్దలూరు వైసీపీ సమన్వయ కర్త, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి తిరిగి వైసీపీలో చేరారు.కొంగలవీడు సర్పంచ్ పందనబోయిన లక్ష్మి ప్రసన్నమరియు వారి అనుచరులను నియోజకవర్గ సమన్వయకర్త కుందూరు నాగార్జున రెడ్డి వారికి వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వేమిరెడ్డి రామచంద్ర రెడ్డి, యర్రం వెంకట రామిరెడ్డి,చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-దర్శి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి పని చేయాలని దర్శి అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు అన్నారు. వివిధ రాజకీయ పార్టీలు, అధికారులతో గురువారం తహశీల్దారు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దారు జి సుజాత, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను గురువారం సాయంత్రం శింగరాయకొండ ఎస్ఐ టి.శ్రీరామ్, సెబ్ ఎస్ఐ దయాకర్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా ఎనిమిది ఫుల్ బాటిల్స్ తీసుకొస్తుండగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని.. వారి వద్ద ఉన్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మద్యం బాటిళ్లను పట్టుకున్న ఎస్ఐ శ్రీరామ్

జీడి మామిడి సాగుపై పెరుగుతున్న ఆదరణ



శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - బాపట్ల: విదేశీ మారక ద్రవ్యాన్ని అర్జించి పెట్టే జీడి మామిడి సాగునకు ఆదరణ మరింతగా పెరుగుతోంది. దేశంలో జీడిపప్పు వినియోగం గణనీయంగా పెరగడంతో జీడి మామిడి సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారని బాపట్ల జీడి మామిడి పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త కె ఉమా మహేశ్వరరావు తెలిపారు. ప్రస్తుత తరుణంలో జీడి మామిడిపై చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను ప్రజాశక్తికి ఆయన వివరించారు. దేశంలో జీడిపప్పు వినియోగం దృష్ట్యా జీడి పరిశ్రమ నిరంతరాయంగా కొనసా గడంతో పాటు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోంది. స్థానిక జీడి మామిడి పరిశోధన స్థానం రూపొందించిన అధిక దిగుబడి నిచ్చే జీడి మామిడి రకాలు సాగుకు బహుళ ప్రాచుర్యం పొందాయి. గింజ పరిమాణం ఎక్కువగా ఉన్న జీడి మామిడి రకాలను పరిశోధన స్థానం రూపొందిం చింది. 11జీడి మామిడి వంగడాలను రాష్ట్రంలో సాగుకు అనువైన రకాలుగా రూపొందించారు. పెరుగుతున్న విస్తీర్ణానికి అనుగుణంగా మేలైన వంగడాలకు అంటు మొక్కలను జీడిమామిడి పరిశోధన కేంద్రంలో ఉత్పత్తి చేస్తు న్నామని అన్నారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలకు ఇక్కడి నుంచే మొక్కలు అందించటానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాయలసీమలోనూ ప్రయోగాత్మ కంగా ఈ తోటల సాగును ప్రోత్సహిస్తున్నారని అన్నారు.

జీడి మామిడి సాగునకు పెరుగుతున్న ఆదరణ

బాపట్ల జీడి మామిడి పరిశోదన కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 11 రకాల వంగడాలు విడుదల కాగా వీటిలో బీపీపీ 8-9-10-11 వంగడాలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. ఇక్కడి ప్రాంతీయ అంటు మొక్కల ఉత్పత్తి కేంద్రం ద్వారా నాణ్యమైన మొక్కలను ఉత్పత్తి చేసి రైతులకు విక్రయిస్తు న్నారు. వీటి సాగుతో నాణ్యమైన అధిక దిగుబడులు వస్తుండటంతో ఇక్కడి మొక్కలకు రాష్ట్ర వ్యాప్తంగా డిమాండ్ ఏర్పడింది. శ్రీకాకుళం, ఖమ్మం, కొత్తగూడెం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి రైతులు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు

వర్షాధారంపై ఆధారపడి సాగు చేసే జీడి మామిడి సాగునకు ప్రస్తుత తరుణంలో పూత దశలో ఆశించే చీడపీడల నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను ఆయన వివరించారు. ప్రధానంగా జీడి మామిడిలో పూతదశలో టీ దోమ తెగులు ఆశిస్తుంది. దీంతోపాటు పుష్పగుచ్ఛంలో గూడు కట్టే పురుగు, కాయ తోలుచు పురుగు, కొమ్మ పుష్పగుచ్చాల చివర్లను తొలుచు పురుగు, కాయ తొలిచే పురుగు, కాయ గింజ తినే పురుగు, పూత లేత ఆకులను తినే తామర పురుగులు, చిగురాకు దశ కాయ ఏర్పడే వరకు వివిధ దశల్లో జీడి మామిడి పంటను నాశనం చేస్తుంటాయి. వీటి నివారణకు మూడు దశల్లో పురుగు మందులు పిచికారీ చేయాలని అన్నారు. కొత్త చిగురు తొడిగి పూత బయటకు వచ్చే సమయంలో క్లోరి పైరిఫాస్ రెండు మిల్లీమీటర్లు చొప్పున ఒక లీటరు నీటిలో కలిపి కొమ్మలు బాగా తడిచేటట్టు పిచికారి చేయాలని చెప్పారు. జీడి గింజ బటాణి సైజులో ఉన్నప్పుడు ప్రోఫెనో పాస్ ముందు లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పున కలిపి పిచికారి చేయాలని అన్నారు. మరిన్ని వివరాలకు బాపట్ల జీడిమామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలను సంప్రదించాలని కోరారు.

గ్రామ సేవకుల సంఘం

రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నాగయ్య మృతి



గుర్రం నాగయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో) నాగయ్య (ఫైల్)

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండ పాలేనికి చెందిన గ్రామ సేవకుల సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గుర్రం నాగయ్య(72) గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. బుధవారం సాయంత్రం ఆయన యర్రగొండ పాలెం పట్టణంలోని మాచర్ల రోడ్డులో గల ఇంటికి వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన మోటారు సైకిల్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. యర్రగొండ పాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్సలు పొందుతూ మరణించాడు. గుర్రం నాగయ్య గ్రామసేవకుల సంఘం యర్రగొండ పాలెం మండల అధ్యక్షుడి స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అధ్యక్షులుగా పని చేశారు. ఆయన అధ్యక్షులుగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డితో పోరాడి మరి గ్రామ సేవలకులకు ప్రమోషన్‌ల జీవోను సాధించారు. ఆ జీవో ఫలితంగా వేలాది మంది గ్రామ సేవకులు విఆర్వోలుగా పదోన్నతి పొందారు. అంతేకాకుండా పశ్చిమ ప్రకాశంలో సిఐటియూ అభివృద్ధికి సైతం విశేషంగా కృషి చేశారు. ఈ క్రమంలో సిఐటియూ, సిపిఎం, సిపిఐ నాయకులు గుర్రం నాగయ్య మృతదేహాన్ని పరామర్శించారు. సిఐటియూ జెండాను ఆయనపై కప్పారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు డి సోమయ్య, సిఐటియూ జిల్లా కార్యదర్శులు డికెఎం రఫీ, జి శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, బి రఘురాం, సిపిఐ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవెండ్ల శ్రీనివాస్, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బాణాల రామయ్య, నాయకులు తిరులమయ్య, లాబాను, సిఐటియూ నాయకులు షేక్ వలీసాహెబ్, పిచ్చయ్య, శేషు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలంలోని సోమేపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను ఇరిగేషన్ శాఖ జేఈ లక్ష్మీనారాయణ అదుపులోకి తీసుకున్నారు.

గురువారం సోమేపల్లి గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక జేసిబి, ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా చెరువు మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఇరిగేషన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం: బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

గ్రామాల అభివృద్ధే తమ లక్ష్యమని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తూర్పుచౌటపాలెం గ్రామంలో మన ఊరికి మన శివన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్నీ పేదలకు చెందాలన్నా, గ్రామాల అభివృద్ధి జరగాలన్నా వచ్చే ఎన్నికల్లో వైసిపికి పట్టం కట్టాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎఎంసి ఛైర్మన్ కెవి రెడ్డి, ఆ గ్రామ నాయకులు మారం నాగిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించి భోజన వసతులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి మహిళలు పూలు చల్లుతూ హారతులు పట్టారు. అనంతరం ఎస్సీ పల్లెల్లో కూడా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచి నాగేశ్వరరావు, ఎంపిటిసి రాజపూడి రత్నం, మాజీ వైస్ ఎంపిపి మారం శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, పలు గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మునెయ్య అంతిమయాత్ర

పాడె మోసిన అశోక్‌రెడ్డి ● రూ.2 లక్షల సాయం అందజేత ● బాధిత కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించిన అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

వందలాది మంది అభిమానులు ప్రజల మధ్య తెలుగుదేశం పార్టీ కార్యకర్త పాముల మునెయ్య అంత్యక్రియలు తగురువారం పూర్తయ్యాయి. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల శోకతప్త హృదయాల జనశోక సముద్రం మధ్యలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, జడ్పిటిసి బుడత మధుసూదన్ యాదవ్‌లు మునెయ్య పార్థివ దేహాన్ని భుజాలపై మోస్తుండగా అంతిమయాత్ర కొనసాగింది. గిద్దలూరు మండలం పరమేశ్వర్ నగర్ గ్రామంలో ఈ నెల 18వ తేదీన స్థానిక వైసీపీ నాయకులు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి మరణించిన టీడీపీ కార్యకర్త పాముల మునెయ్య భౌతిక కాయానికి గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ జెండా కప్పి, పూలమాల వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ



మునెయ్య పార్థివదేహం మోస్తున్న అశోక్‌రెడ్డి, మధుసూదన్ యాదవ్

సభ్యులను ఓదార్చారు. మునెయ్య కుటుంబ సభ్యులను రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు ఫోన్ ద్వారా పరామర్శించి నివాళి అర్పించారు. తెలుగుదేశం పార్టీ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ మునెయ్యను హత్య చేసిన వైసీపీ నాయకులను, వారి వెనుక ఉండి హత్య చేయించిన సూత్రధారులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి చర్యలకు పాల్పడినవారు ఎంతటి వారయినా ఉపేక్షించరాదని పోలీసుశాఖను డిమాండ్ చేశారు. దోషులను శిక్షించే వరకు తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు. మునెయ్య భార్యకు అశోక్‌రెడ్డి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించి, మనోధైర్యం కల్పించారు. ప్రశాంతంగా ఉన్న గిద్దలూరు నియోజకవర్గంలో హత్యా రాజకీయాలకు తెరలేపిన వారిని నియోజకవర్గ ప్రజలు ఉపేక్షించరని, తగిన బుద్ధి చెబుతారని సూచించారు. అనంతరం మునెయ్య పార్థివ దేహాన్ని మట్టిలో కలిపి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై అధ్యాపకుడి దాడి

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఘటన

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని పాలిటెక్నిక్ కళాశాల దళిత విద్యార్థిపై అధ్యాపకుడు విచక్షణ రహితంగా దాడి చేసిన సంఘటన గురువారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం పొన్నూరు మండలం మాచవరం గ్రామానికి చెందిన బొనిగల నవీన్ కుమార్ పాలిటెక్నిక్ మొదటి యేడాది చదువుతున్నాడు. కళాశాలలో అధ్యాపకుడు కొత్తమసు బాలాజీకి, విద్యార్థికి మధ్య మాట మాట పెరిగి అధ్యాపకుడు విద్యార్థి నవీన్ కుమార్‌పై కర్రతో దాడి చేశాడని, గాయాలతో ఇంటికి చేరుకున్న విద్యార్థి జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో గాయాలతో ఉన్న విద్యార్థిని తల్లితండ్రులు బాపట్ల ఏరియా వైద్యశాలలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



దళిత సంఘాల నాయకుల పరామర్శ

పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి నవీన్ కుమార్‌ను దళిత సంఘాల నాయకులు ఏరియా వైద్యశాలలో పరామర్శించారు. విద్యార్థిపై దాడి చేయడమే కాక కులం పేరుతో దూషించిన అధ్యాపకుడిపై తక్షణమే ఎస్సి ఎస్టీ కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నిందితుడిపై కేసు నమోదు చేయాలి

బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ మొదటి యేడాది విద్యార్థి నవదీప్‌ని అకారణంగా కొట్టి గాయపరిచిన అదే కళాశాల డ్రాయింగ్ అధ్యాపకుడు కొత్తమాసు బాలాజీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు పి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థి నవదీప్‌ను పరామర్శించిన మనోజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థిపై దాడి జరిగి 24 గంటలు గడిచిపోయినా బాలాజీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారన్నారు. వెంటనే అధ్యాపకుడిని అరెస్ట్ చేయాలన్నారు. బుధవారం ఉదయం కళాశాలలో ఘటన జరిగితే దెబ్బలు తగిలిన అతనికి ఎటువంటి ప్రథమ చికిత్స చేయించకుండా కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. గాయపడిన నవదీప్ కు తోటి విద్యార్థులే ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి తీసుకెళ్లిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పొరపాటున విద్యార్థికి ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. దీనిపై కళాశాల యాజమాన్యం వెంటనే బాధితులను పరామర్శించి న్యాయం చేయాలన్నారు. విద్యార్థిపై దాడి చేసిన అధ్యాపకుడు బాలాజీని విధులను తొలగించాలని కోరారు. పరామర్శించిన వారిలో శరత్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, గోపి, ఏసురత్నం పాల్గొన్నారు.

నలుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం గడిగోట గ్రామ పంచాయతీ పరిధి పరమేశ్వర్ నగర్‌లో పాముల మునెయ్య హత్య కేసులో నిందితులు గుండాల చిన్న అల్లూరయ్య, గుండాల ఈశ్వరయ్య, గుండాల ప్రేమ్ కుమార్, కొమ్మి రంగనాయకులు నలుగురు ముద్దాయిలను ఈ నెల 20 తేదీ రాత్రి గడికోట చెక్ పోస్టు వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు గిద్దలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వైవి సోమయ్య తెలిపారు.

కోడిపందాల స్థావరాలపై దాడి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండలంలోని ఇరగారెడ్డిపల్లి గ్రామంలో హనుమంతునిపాడు ఎస్ఐ శివనాగరాజు కోడిపందాలు ఆడుతున్న స్థావరాలపై మెరుపు దాడి చేయగా రెండు పందెం కోళ్ళు, 11500 నగదు, 9 ఫోన్లు, 12 కోడిపందాలు కత్తులను స్వాధీన పరుచుకున్నారు. కోడిపందాలు ఆడుతున్న పదిమంది ఆటగాళ్లను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు శివనాగరాజు తెలియజేశారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

ఎమ్మెల్యే డాక్టర్ స్వామి పరామర్శ

ప్రజాశక్తి - శింగరాయకొండ

శింగరాయకొండ పంచాయతీలోని మసనం శేషారావు సతీమణి మసనం భాగ్యలక్ష్మి దశదినకర్మ కార్యక్రమంలో కొండెపి ఎంఎల్ఎ డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. ఆమె చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఆయన వెంట టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కృష్ణ, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, మించల బ్రహ్మయ్య, ఇమ్మడిశెట్టి రామారావు, దాసరి యానాదిరావు తదితరులు ఉన్నారు.


మహిళలను సత్కరిస్తున్న అంగన్‌వాడీలు

బాలింతలకు సన్మానం

ప్రజాశక్తి - సంతమాగులూరు

గర్భిణీ, బాలింతలకు పోషకాహార ఆవశ్యకతను తెలియజేసేలా అంగన్‌వాడి సెంటర్స్ నందు తల్లులకు వంటల పోటీలు నిర్వహించాలని సిడిపిఒ డి సుధ తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ పక్వాడా కార్యక్రమం, పిసి పిఎన్ డిటీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలతో వివిధ రకాల వంటలపై అవగాహన కలిగేటట్లుగా తల్లులతో ఈ పోషణ పక్షోత్సవాలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమాలను జనాందోళన్ డాష్ బోర్డులో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాహిత్య మాట్లాడుతూ పిఈపిఎన్‌డిటీ చట్టం ఆవశ్యకతను తెలిపారు. చట్ట విరుద్ధ గర్భస్రావాలకు ఉన్న శిక్షలు, దాని వల్ల ఆ తల్లికి వచ్చే అనారోగ్యం గురించి తెలిపారు. ఎంఈఓ దినేష్ కుమార్ మాట్లాడుతూ లింగ వివక్షత లేని సమాజాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఇద్దరు ఆడపిల్లలతో ఆపరేషన్ చేయించుకున్న తల్లులను, అంగన్‌వాడి కార్యకర్తలుగా పనిచేస్తూ తమ ఆడపిల్లలను ప్రయోజన కారులుగా తీర్చిదిద్దిన అంగన్‌వాడి కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. లోప పోషణ రహిత సమాజాన్ని సాకారం చేసుకుందామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం దుద్దు మస్తానరావు, ఎఎన్ఎంలు, ఆషాలు, అంగన్‌వాడి కార్యకర్తలు, సూపర్ వైజర్లు సుష్మ, ప్రమీల పాల్గొన్నారు.


వృద్ధులకు నమూనా పోలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

వృద్ధులకు ఇంటి వద్దే ఓటు..

ప్రజాశక్తి - పొదిలి

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం భారత ఎన్నికల కమీషన్ కల్పించిందని తహశీల్దార్ మహమ్మద్ జియా ఉల్ హక్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణంలోని వృద్ధులు, వికలాంగులకు ఓటు హక్కు వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40శాతం అంగవైకల్యం ఉన్న వికలాంగులు, 80 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎల్ చంద్రశేఖర్ రెడ్డి, సిడిపిఒ సుధ మారుతి, విఆర్వో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ ఎంఎల్ఎ దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వైసిపి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని, వైసిపి వైఫల్యాలను ప్రజలలోకి తీసుకెళ్ళాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు కార్యకర్తలకు సూచించారు. ఒంగోలు నగరం 10వ డివిజన్ కొప్పోలు టిడిపి కార్యాలయంలో డివిజన్ కమిటీ నాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఒంగోలు నగరం 33వ డివిజన్ మంగమూరు రోడ్డు టిడిపి కార్యాలయంలో డివిజన్ కమిటీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిపారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో పర్యటించారు. పారిశుధ్య పనులు అధ్వాన్నంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అటకెక్కాయని అన్నారు. టిడిపి నేతలు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వైసిపి అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. తెలుగుదేశం మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం అధికారంలోకి రావటం ఖాయమని, టిడిపి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని అన్నారు. ఒంగోలు నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మేడికొండ మోహనరావు, పి భాస్కరరెడ్డి, నిడిపినేని భాస్కర్, గోగినేని రామారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే

వాలంటీర్లను తొలగిస్తాం

హెచ్చరించిన పరిషత్ ప్రత్యేక అధికారి గౌసియా బేగం

ప్రజాశక్తి - పొదిలి

ఏదైనా రాజకీయ పార్టీ తరుపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనే వాలంటీర్లను తొలగిస్తామని మండల పరిషత్ ప్రత్యేక అధికారి షేక్ గౌసియా బేగం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు ప్రచారాలు చేసుకోవాలన్నా, పోస్టర్లు వేసుకోవాలంటే తప్పనిసరి అనుమతి తీసుకోవాలన్నారు. ఇందులో వాలంటీర్లు రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొని, పార్టీ కండువాలు వేసుకుని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో కొంతమంది వాలంటీర్లను విధుల నుంచి తొలగింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి గౌసియా బేగం


మంత్రి సన్మానిస్తున్న దృశ్యం

మంత్రి సురేష్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామపంచాయతీలోని ఆర్యవైశ్య నాయకులు కొత్తూరి శ్రీ రంగనాయకులు నివాసంకు రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండెపి నియోజకవర్గం వైసిపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం వెళ్లారు. కొత్తూరు శ్రీ రంగనాయకులు ఆధ్వర్యంలో మంత్రి సురేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. గడిచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఆర్యవైశ్య ప్రముఖులతో పాటు వైసిపి అధ్యక్షులు సామంతుల రవికుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - పొదిలి

ఇటీవల కూటమి ఆధ్వర్యంలో భారిగా హాజరైన శంఖారావంకు సంబంధించిన రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని మార్కాపురం టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి నాయకులు, కార్యకర్తలను కోరారు. పొదిలి, కొనకనమిట్ల మండలాల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి నిత్యం కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికార పార్టీ నాయకుల అక్రమాలను నిలువరించేదుకు ప్రతి కార్యకర్త సిద్ధపడాలని సూచించారు. ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ అక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. టిడిపి ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వైసిపి రద్దు చేసి పేదలకు చేసిన ద్రోహాన్ని వివరించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి లోపాలన్ని ప్రజలకు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులు పూర్తి కాకుండానే నిధులు స్వాహా


భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల పరిషత్ కార్యాలయానికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి రంగులు వేసి అభివృద్ధి పరచాలనే కోణంలో చేపట్టిన పనులు పూర్తికాకుండానే గుత్తేదారులకు అధికారులు, ప్రజాప్రతినిధులు బిల్లులు మంజూరు చేయటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి రంగులు వేయాలన్న ఆలోచన తద్వారా ఎంతో కొంత మిగుల్చుకోవచ్చనే దృక్పథంతో పాలకులు, అధికారులు కుమ్మక్కై, ఎలాంటి బహిరంగ తీర్మానాలు, ఎజెండాలు లేకుండా రూ.14లక్షల నిధులతో పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులను సుమారు 6పనులుగా నమోదు చేసి ఎలాంటి టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిపై భట్టిప్రోలుతో సంబంధంలేని మరో మండలానికి చెందిన ద్వాక్రా గ్రూపు సభ్యురాలకు కేటాయించారు. దీనిపట్ల పలు అనుమానాలు కలిగిస్తున్నాయి. ఈ నిధులతో కార్యాలయానికి రంగులు వేయటం, గ్రౌండ్ ఫ్లోర్లో టైల్స్ ఏర్పాటు చేయడం, వివిధ గదులకు సీలింగు నిర్మించడం వంటి పనులతో పాటు కార్యాలయానికి అనుబంధంగా ఉన్న మరుగుదొడ్లను పూర్తిగా తొలగించి నూతనంగా మరుగుదొడ్ల నిర్మించి, వర్షానికి కార్యాలయం చుట్టూ నిలబడే వర్షపు నీరు బయటకు మళ్లే విధంగా పైప్ లైన్ నిర్మాణం చేయడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ గుత్తేదారు మాత్రం కార్యాలయానికి పూర్తిగా రంగులు వేయకుండా కొంతమేర రంగులు వేసి కింద అరకొరగా నాణ్యత లోపంగా టైల్స్ నిర్మాణం చేపట్టి బిల్లులు చేజిక్కించుకున్నారు. అందుకు మద్దతుగా సంబంధిత పంచాయతీరాజ్ శాఖ ఏఈ, మండల పరిషత్ అధికారులు, మండల ప్రజా పరిషత్ సభ్యులు కుమ్మక్కై, పనులు పూర్తికాకుండానే సుమారు రూ.8లక్షల వరకు నిధులను డ్రా చేసుకొని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టైల్స్ నిర్మాణం పూర్తిగా లోపం భూయిష్టంగా జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన టైల్స్ అక్కడక్కడ పగిలిపోవడంతో వాటిని తిరిగి నిర్మించినప్పటికీ నాణ్యత లోపంగానే జరిగాయి. అంతేకాక కార్యాలయం బయట నిర్మించిన టైల్స్ కూడా ఇసుకను పరిచి దానిపై టైల్స్ ఏర్పాటు చేసి మసిపూసి మారేడు కాయ చేశారని చర్చించుకుంటున్నారు. వర్షాకాలం సమీపిస్తే వర్షాలకు బయటివేసిన టైల్స్ పూర్తిగా విరిగిపోయి కొట్టుకుపోయే ప్రమాదం కూడా లేకపోలేదని వ్యాఖ్యానిస్తున్నారు.

పనులు పూర్తికాకుండానే ఎం బుక్ ఎలా రికార్డు చేస్తారు?

ప్రజాధనంతో చేపట్టే పనులు నాణ్యత ప్రమాణాలను సరిచూసుకొని పనులు జరిగిన విధానాన్ని అంచనా వేసి, దానికి తగిన విధంగా బిల్లులు మంజూరు చేయాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా మండల పరిషత్ అధికారులు గుత్తేదారుతో కొమ్మక్కై, నాణ్యత లోపభుజిష్టంగా ఉన్న పనులకు రూ.8లక్షల నిధులు ఏ విధంగా చెల్లించారని, దీనిపై ఉన్నతాధికారులు పరిశీలన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాకపోగా దానికి అనుసంధానంగా సరఫరా కావాల్సిన వాటర్ ట్యాంకు కూడా పని చేయకపోవడంతో కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు గాని, కార్యాలయ సిబ్బంది గానీ వాటిని వినియోగించుకోవడానికి అవకాశం లేకపోయిందని వాపోతున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, పనుల నాణ్యత పరిశీలించకుండా లక్షల విలువైన ప్రభుత్వ నిధులు ఏవిధంగా చెల్లిస్తారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు నెలరోజులు పైగా మరుగుదొడ్ల వినియోగం లేక నిరుపయోగంగా ఉండటమే కాక దుర్వాసన వెదజల్లుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రంగుల పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయటమే కాక సొమ్ముస్వాహా చేసిన వారిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.


అస్తవ్యస్తంగా ఉన్న మరుగుదొడ్లు

ప్రజాశక్తి 5
శుక్రవారం 22 మార్చి 2024

'కామ్రేడ్ సూరసాని' మార్గం అనుసరణీయం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని సుందరయ్య భవనంలో గురువారం విశ్రాంత వ్యవసాయ అధికారి కామ్రేడ్ సూరసాని లక్ష్మిరెడ్డి ఐదవ వర్ధంతి సభ పిసి కేశవరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవి కొండారెడ్డి హాజరై సూరసాని లక్ష్మిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ సురసాని లక్ష్మిరెడ్డి వ్యవసాయ అధికారిగా రైతుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. ప్రజా సమస్యలపై కూడా ఎంతగానో కృషి చేశారని తెలిపారు. కనిగిరిలో సుందరయ్య భవనం నిర్మాణానికి స్థలాన్ని అందించడంతోపాటు నిర్మాణానికి కషి చేశారన్నారు. కనిగిరిలో ప్రజా ఉద్యమాలలో కీలక భూమిక వహించారని అన్నారు. ప్రజల కోసం శ్రమించిన లక్ష్మిరెడ్డి లాంటివారు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. నిస్వార్థంగా ప్రజల కోసం, ఉద్యమాల కోసం చూపిన చొరవ ఎనలేనిదని అన్నారు. లక్ష్మిరెడ్డి చూపిన మార్గం అనుసరణీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు వి మాలకొండారెడ్డి, విశ్రాంత ఎంఈఓ ఓ మాలకొండారెడ్డి, సిపిఎం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, పి మహేష్, బడుగు వెంకటేశ్వర్లు, రాయళ్ల మాలకొండయ్య, లక్ష్మిరెడ్డి సతీమణి తిరుపతమ్మ, కుటుంబ సభ్యులు విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన ఇద్దరు వాలంటీర్లు



ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని బూదవాడ గ్రామ పంచాయతీ పరిధిలో టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిడిపి సంతనూతలపాడు ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో ఇద్దరు వాలంటీర్లు జంగ్రాజుపల్లి విజయ్, బత్తుల రవితో పాటు, 10 బిసి, ముస్లిం కుటుంబాల వారు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతనూతలపాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు గత ఐదేళ్ళుగా కుంటుపడ్డాయని, టిడిపి అధికారంలోకి వస్తే అభివృద్ధితోపాటు, సంక్షేమం కూడా చేసి చూపిస్తామని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర సర్వతోభిముఖాభివృద్ధి సాధ్యమని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సూపర్ సిక్స్ కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు అడకా స్వాములు, టిడిపి మండల అధ్యక్షులు జి రాఘవరావు, జనసేన అధ్యక్షులు వల్లెపు శివ, టిడిపి గ్రామ అధ్యక్షులు లగడపాటి శ్రీను, నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వర్లు, యర్రగుంట్ల శ్రీను, యడ్లపల్లి రామబ్రహ్మం, పుట్టా బ్రహ్మయ్య, ఉన్నం సుబ్బారావు, జంగ్రాజుపల్లి పురుషోత్తం, బత్తుల నరసింహారావు, భవానీ ప్రసాదు, లగడపాటి రామారావు, రమణయ్య, ఆదిబాబు, బాలరాజు, జగదీష్, వాసు పాల్గొన్నారు.

కనిగిరిలో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-కనిగిరి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం కనిగిరి పట్టణంలోని ప్రధాన వీధులలో కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. పామూరు బస్టాండ్ సెంటర్లో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కనిగిరి డిఎస్‌పి ఆర్ రామరాజు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర బలగాలు కనిగిరి వచ్చాయని, వారి ద్వారా ఎన్నికల్లో పటిష్టమైన బందోబస్తును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ డి వెంకటేశ్వరరావు, ఎస్ఐలు త్యాగరాజు, శివ నాగరాజు, సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అడవులను కాపాడితే అవనిని కాపాడినట్లే

ప్రజాశక్తి-కనిగిరి

పర్యావరణం బాగుండాలంటే గాలి, నీరు సమృద్ధిగా ఉంటేనే చెట్లు బాగుంటాయని పిసి పల్లి మండల విద్యాధికారి, కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవ్ అన్నారు. గురువారం అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా సమగ్ర శిక్ష, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అడవులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ మంద్రు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అడవులు, పర్యావరణం, వాతావరణ మార్పులపై విద్యార్థుల్లో అవగాహన పెంపునకు తమ సంస్థ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నాగ పద్మజారాణితో పాటు ఉపాధ్యాయులు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవలకుంట్ల మాజీ సర్పంచ్ టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పుల్లలచెరువు మండలంలోని కవలకుంట్ల గ్రామ మాజీ సర్పంచ్ శనగా బాల వెంకటరెడ్డి, మద్దుల వెంకట రామిరెడ్డి, ఆవుల వెంకట రామిరెడ్డి, రేగులగడ్డ నాగయ్య, ఆవుల రామయ్య గురువారం యర్రగొండపాలెంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎరిక్షన్ బాబు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ఒంటెద్దు పోకడల విధానాలు నచ్చక టిడిపిలో చేరామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శనగా నారాయణరెడ్డి, అంజిరెడ్డి, ఆకాష్‌రెడ్డి, బివి సుబ్బారెడ్డి, బాలకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న విజయ్ కుమార్‌రెడ్డి దంపతులు

వృద్ధులకు సాయం పంపిణీ

ప్రజాశక్తి-కనిగిరి

విశ్రాంత వ్యవసాయ అధికారి దివంగత సూరసాని లక్ష్మిరెడ్డి వర్థంతిని పురస్కరించుకొని ఆయన పెద్ద కుమారుడు విజయ్ కుమార్‌రెడ్డి, కోడలు శివలక్ష్మి కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులో గల వాసవి వృద్ధాశ్రమానికి 50 కేజీల బియ్యం, వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేశారు. సాయికృష్ణ దివ్యాంగుల ఆశ్రమంలో 20 మంది దివ్యాంగులకు, భవిత కేంద్రంలో 15 మంది చిన్నారులకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఎస్‌కెఆర్ బధిరుల పాఠశాలలో 35 మంది చిన్నారులకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. దివ్యాంగులకు, వృద్ధులకు సహకారం అందించడం సంతోషకరంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురసాని బ్రహ్మానందరెడ్డి, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు నీటిని అందుబాటులో ఉంచాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ బేబీరాణి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పశువులకు తగినంత చల్లని నీటిని అందుబాటులో ఉంచాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ కే బేబీరాణి అన్నారు. మండలంలోని సంతనూతల పాడు గుమ్మళంపాడు గ్రామాలలో ఆమె గురువారం పర్యటించి పశు పోషకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ పశువులను ఉదయం 10 గంటల లోపు సాయంత్రం మూడు గంటల తర్వాత మాత్రమే పశువుల మేపుకునేందుకు విప్పాలని సూచించారు. మధ్యాహ్న సమయంలో పశువులను నీడ ప్రాంతంలో కట్టివేయాలని తెలిపారు. పచ్చిగడ్డి, ఎండుగడ్డిని పుష్కలంగా అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. అనంతరం వేసవిలో పశుపోషకులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ బి ప్రతాపరెడ్డి, పశువుల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

దద్దాలను కలిసిన మండల నాయకులు

ప్రజాశక్తి-సిఎస్ పురం రూరల్

మండలంలోని వైసీపీ నాయకులు గురువారం వైసిపి కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌ను కలిశారు. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉంటున్న మండలానికి చెందిన వైసీపీ నాయకులు బుధవారం తమతమ స్వగ్రామాలకు వచ్చారు. గురువారం కనిగిరి వెళ్లి వైసిపి కార్యాలయంలో దద్దాలను కలిశారు. పార్టీ నాయకులందరూ ఐకమత్యంతో పనిచేసి తనను గెలిపించాలని, తద్వారా జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేయాలని ఈ సందర్భంగా పార్టీ నాయకులను దద్దాల నారాయణ యాదవ్ కోరారు. జడ్పిటిసి మేకల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, వైసీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, సచివాలయాల మండలం కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, ముఖ్య నాయకులు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, రాధాకష్ణారెడ్డి, డాక్టర్ షేక్ గౌస్, బొర్రాజు రమణయ్య (టైగర్), మేడిపోయిన అటేలయ్య, కత్తులపల్లి రమణారెడ్డి, మిరియం వెంకటేశ్వర్లు, పులి చంద్రశేఖర్‌రెడ్డి, బసివి శేఖర్, బత్తుల దేవరాజు, షేక్ కాజా, సంగిశెట్టి వాసు, తోట అశోక్, దద్దాలను కలిసిన వారిలో వున్నారు.



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

టిడిపిలో చేరిన ఇద్దరు కౌన్సిలర్లు

ప్రజాశక్తి-గిద్దలూరు

మరో నెలన్నరలో ఏపీలో ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే ఎన్నికల తేదీ కూడా వచ్చేసింది. అయితే ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పట్టణంలోని పలువురు వైసీపీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యుడు పార్టీకి గుడ్ బై చెప్పి టీడీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీకి చెందిన కౌన్సిలర్లు గడ్డం భాస్కర్‌రెడ్డి, లోక్కు రమేష్, కో ఆప్షన్ సభ్యుడు దమ్మాల జనార్దన్, వెల్లుపల్లి ఎంపీటీసీ గర్రె శ్రీనాథ్ లు వారి అనుచరులతో సహా గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



అశోక్‌రెడ్డిని సత్కరిస్తున్న పార్టీలో చేరినవారు

టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో గురువారం పలు కుటుంబాలు టిడిపిలో చేరాయి. బేస్తవారిపేట మండలం చెరుకుపల్లె గ్రామానికి చెందిన 20 కుటుంబాలు, వంగ పాడు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అందరూ కలిసి సమిష్టిగా టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మూల పాండు రంగారెడ్డి, షేక్ ఖాసింసాహెబ్, పేరం కాశిరెడ్డి, షేక్ మౌలా, బి వెంకట సుబ్బయ్య, బి కిరణ్, బి కృష్ణారావు, వి అశోక్‌బాబు, వార్డు మెంబరు వెంకటయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎరిక్షన్‌బాబు సమక్షంలో టిడిపిలో చేరిన మాజీ ఉపసర్పంచి

వైపాలెం మాజీ ఉప సర్పంచ్ టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: యర్రగొండపాలెం పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ షేక్ మస్తాన్ టిడిపిలో చేరారు. ఆయనతో పాటు మరో 20 ముస్లిం మైనార్టీ కుటుంబాలు కూడా పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమం యర్రగొండపాలెంలోని టిడిపి కార్యాలయంలో గురువారం జరిగింది. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీయాలంటే చంద్రబాబు నాయుడు ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒంగోలు ఆదిరెడ్డి, షేక్ ఇస్మాయిల్, మంత్రూనాయక్, మస్తాన్‌వలి, వెంకట్రావు గౌడ్, మహేష్‌నాయుడు, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

146 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి గురువారం మద్దిపూడి మండలం చిలంకూరు గ్రామ రైతులు వేలం కేంద్రానికి 933 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 787 బేళ్ల కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 146 బేళ్లను తిరస్కరించారు. అత్యధిక ధర కిలో రూ.231 పలుకగా అత్యల్ప ధర రూ.220 పలికింది. సరాసరి కిలో ధర 229.50 రూపాయలు పలికింది. వేలంలో 23 కంపెనీలు పాల్గొన్నాయి. వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ వేలాన్ని నిర్వహించారు.



పోషణ పక్వాడ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిడిపిఓ

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని వెంకటాపురం, విప్పర్ల వారిపాలెంలో పోషణ పక్వాడ జనాందోళన కార్యక్రమం గురువారం నిర్వహించారు. తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆహారం ఎనిమిక్ ముక్తి భారత్ నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సిడిపిఓ కృష్ణకుమారి తెలిపారు. ఎనిమియా ముఖి భారత్‌లో భాగంగా ఎనిమీయ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన ఆహార పదార్థాలను సిడిపిఓ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.



అశోక్ కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పవన్ కుమార్

అశోక్‌కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక చీరాల ఇంజనీరింగ్ కాలేజీలో హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ విభాంకు చెందిన ఇంగ్లీష్ అధ్యాపకులు చింతా అశోక్ కుమార్ డాక్టరేట్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌విఎస్ఆర్ పవన్ కుమార్ తెలిపారు. కళాశాల ఆవరణలో ఈ సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ "కమ్యూనికేటివ్ లాంగ్వేజ్ లెర్నింగ్‌లో ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ప్రభావం." అనే అంశంపై శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్, సీహెూర్, భోపాల్, మధ్యప్రదేశ్ లో పరిశోధన చేసి డాక్టరేట్ పొందినట్లు వివరించారు. ఈసందర్భంగా అశోక్ కుమార్‌ను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ విఎల్ రంజిత్, డీన్ ఆఫ్ అకడమిక్స్ ఎం పవన్ పాల్గొన్నారు.



భట్టిప్రోలు పర్యటిస్తున్న అశోక్ బాబు

ప్రజలకు అందుబాటులో ఉంటా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో వైసిపి అభ్యర్థి వరికూటి అశోక్ బాబు తన ప్రచారాన్ని విస్తృతం చేశారు. ఉదయం 6 గంటలకే భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ప్రతిరోజు నియోజకవర్గంలో ఏదో మండలంలో పర్యటిస్తూ ప్రజలకు దగ్గరవుతున్నారు. ఇదిలా ఉండగా గురువారం వేమూరులో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు అశోక్ ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. ఆయన వెంట ఆయా మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - కర్లపాలెం

కర్లపాలెం గ్రామానికి చెందిన 20మంది వైసిపీ నాయకులు, కార్యకర్తలు 9వ వార్డు మెంబెర్ కొండమూది పద్మావతి ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయంలో టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి వర్మ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ముందస్తు ప్రణాళికతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - బాపట్ల

రైతులు ముందస్తు వ్యవసాయ ప్రణాళికతో భూసార పరీక్షలు, వేసవి దుక్కులు వంటివి చేపట్టి శాస్త్రవేత్తలు సలహాల మేరకు యాజమాన్య పద్దతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, లాం ప్రాంతీయ పరిశోధన కేంద్రం పరిశోధన సహాయ సంచాలకులు బి శ్రీలక్ష్మి అన్నారు. ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం, బాపట్ల ఏరువాక కేంద్రం సంయుక్తంగా జరిగిన ఏరువాక కేంద్రం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్న వ్యవసాయ పరిశోధనల ఫలితాలు, సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందుతున్న కొత్త రకం వ్యవసాయ వంగడాలు రైతులుకు అందుబాటులో ఉన్నాయన అన్నారు. అపరాల సేద్యం, సేంద్రియ వ్యవసాయం, కలుపు నివారణ, చీడ పీడల నివారణకు చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యలు, ఆధునిక వ్యవసాయ పనిముట్ల వాడకం వంటి అంశాలను రైతులకు వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్తలు ప్రస్తుత ఆర్థిక ఏడాది ఖరీఫ్, రబీ



మాట్లాడుతున్న లక్ష్మి

కాలాల్లో చేపట్టనున్న వ్యవసాయ పనులను దృశ్యమాధ్యమం ద్వారా రైతులకు వెల్లడించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర సమన్వయ కర్త బాల మురళీధర్ నాయక్, వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం ప్రధానాచార్యులు ఎంసి ఓబయ్య, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ (పప్పు దినుసులు విభాగం) ఎంవి రమణ, డిఆర్‌సిడిటిసి ఎంవి విజయ నిర్మల, ఎడిఎ లక్ష్మి, జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ ఎం హనుమంతరావు, జిల్లా మత్స్యశాఖ జెడి పి సురేష్, ఎడిఎ టి రత్నకుమారి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి - రేపల్లె

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డిఓ హేలా షారోన్ కోరారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలంటే ఎవరూ అందోళన చెందవద్దని అన్నారు. ఏప్రిల్ 15వరకు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తుది ఓటరు జాబితాలో ఎవరిదైనా ఓటు హక్కు లేకపోతే బూత్ లెవల్ ఎలక్ట్రోరల్ ఏజెంట్, రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. ఎవరైనా ఓటర్లను ప్రభావితం చేసే విధంగా చేస్తే సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వంద నిమిషాల్లో ఫిర్యాదును పరిశీలించి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో ప్రకటనలు ఇచ్చే విషయంలో డీపీఆర్‌ఒ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎంసీకి సమాచారం ఇవ్వాలన్నారు. వారి అనుమతితోనే పబ్లిష్ చేయించుకోవాలని అన్నారు.



సమావేశంలో ఆర్‌డిఒ హేలా షారోన్

కరపత్రాలు, పోస్టర్లపై కచ్చితంగా ముద్రించిన వారిపేరు, ఫోన్ నంబరు ఉండాలని అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో నాయకులు, యువత సోషల్ మీడియా వినియోగం విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్వేషాలు రెచ్చగొట్టేవి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేయవద్దని అన్నారు. అనవసరపు మేసేజ్‌లతో ఇబ్బందులకు గురికావద్దని అన్నారు. యువత కేసులపాలై జీవితాలు నాశనం చేసుకోవద్దని చెప్పారు. కేసులు నమోదైతే భవిష్యత్‌లో ఇబ్బంది అవుతుందని తెలిపారు.

వృద్ధునిపై చేయిచేసుకున్న పోలీసుపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పంగులూరు

ముప్పవరంలోని టిడిపి కార్యాలయంలో కొరిశపాడు మండలంలోని కుర్రవానిపాలెం, కొరిశపాడు, రావినూతల, రాచపూడి, దైవాలరావూరు, బొల్లవరప్పాడు, ప్రాసంగులపాడు, పమిడిపాడు గ్రామాల శ్రేణులతో ఎంఎల్‌ఎ గొట్టిపాటి రవికుమార్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజల సమస్యలకు పరిష్కారం చంద్రబాబు పాలన మళ్లీ తెచ్చుకోవడం ఒక్కటేనని అన్నారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో సూపర్ సిక్స్ పథకాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. ఓటరు జాబితా పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉచిత పథకాల పేరుతో రూ.10 ఇస్తూ ప్రజల దగ్గర నుండి రూ.100 వసూలు చేస్తున్న జగన్ విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. బల్లికురవ మండల కేంద్రంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న టిడిపి సానుభూతి పరుడైన వృద్ధుడిపై తనిఖీ పేరుతో స్థానిక పోలీసు అధికారి చేయి చేసుకోవడం అహంకార ధోరణికి నిదర్శనమని అన్నారు. చేయి చేసుకున్న పోలీసు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా సౌజన్యంతో ఏర్పాటు చేసిన వినియోగదారుల సేవా కేంద్రాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వలపర్ల ఎస్‌బిఐ మేనేజర్ బి నరేష్ కుమార్ అన్నారు. మండలంలోని కోలలపూడిలో ఏర్పాటు చేసిన వినియోగదారుల సేవాకేంద్రాన్ని అయన గురువారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఏర్పాటు చేసిన సేవా కేంద్రంలో ఖాతాదారులు బ్యాంకులకు వచ్చే పని లేకుండా అన్ని రకాల సేవలు పొందవచ్చని తెలిపారు. రూ.30వేలు వరకు నగదు విత్ డ్రా చెయ్యడం, తీసుకోవడం, కొత్త ఖాతాలు ప్రారంభించడం వంటి సేవలు పొందవచ్చని తెలిపారు. స్టేట్ బ్యాంకు అందిస్తున్న అవకాశాన్ని వినియోగించుకొవాలని కోరారు .



ఎస్‌బిఐ సేవా కేంద్రం ప్రారంభిస్తున్న మేనేజర్ నరేష్‌కుమార్



యాప్‌లను వివరిస్తున్న సిడిపిఓ విజయలక్ష్మి

యాప్‌లను వినియోగించాలి

ప్రజాశక్తి - వేమూరు

ప్రభుత్వం అంగన్వాడీలకు అమలు చేస్తున్న వివిధ రకాల యాప్‌లపై అవగాహన కలిగి వాటిని సక్రమంగా వినియోగించాలని అమర్తలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ జి విజయలక్ష్మి సూచించారు. ప్రాజెక్టు పరిధిలోని వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రీస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వస్తువులు, పరికరాలను వినియోగించుకుని తద్వారా విద్యాబోధన చేయాలన్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందజేసి రికార్డులను నమోదు చేయాలని సూచించారు. పిల్లల హాజరు శాతాన్ని సక్రమంగా రికార్డు చేయాలని చెప్పారు. యాప్‌లలో ఒకే విధమైన సమాచారం నమోదు చేయాలని చెప్పారు. ఒకదాని నుండి మరొకదానికి ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా సక్రమంగా నమోదు చేసుకోవాలని తెలిపారు.

ప్రజాశక్తి కథనంతో ఏర్పాటైన సమావేశాలు

అమర్తులూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఎలాంటి ప్రాజెక్టు సమావేశాలు జరగటం లేదని, ఉన్న కార్యాలయం సమావేశానికి అనుకూలంగా లేకపోవడంతో అంగన్‌వాడీలు సమావేశాలకు దూరమయ్యారంటూ ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో కథనం నిలబడింది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ప్రాజెక్టు సమావేశాలు ఏర్పాటు చేసి కార్యకర్తలకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాలను వివరించాలని ఆదేశించారు. దీంతో గురువారం వేమూరులో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అమర్తలూరు ప్రాజెక్టు పరిధిలో ఐదు మండలాల నుండి 308 అంగన్‌వాడి కేంద్రాలు ఉండగా వీరందరికీ ఒకేసారి ప్రాజెక్టు సమావేశం ఏర్పాటు చేయటానికి వేమూరు మండల పరిషత్తు సమావేశ మందిరం చాలకపోవడంతో రెండు విడతలగా సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి ప్రాజెక్టు, సెక్టార్ సమావేశం నిర్వహిస్తుంటే కార్యకర్తలకు ఎప్పటికప్పుడు నూతన విధానం అవగాహన అవుతుందని, ఇలాంటి సమావేశం ఏర్పాటు చేయటం పట్ల అంగన్‌వాడీలు ఆనంద వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎసీడీపీఓ విజయరాణి, సెక్టర్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'మోసం చేసిన జగన్'

ప్రజాశక్తి - భట్టిప్రోలు



కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు

సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో బలిజ కులస్తుల ఓట్లతో గెలుపొంది వారిని మోసం చేశారని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు ఆరోపించారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలిజ కులస్తులు అధికంగా ఉన్న రాయలసీమలో 74అసెంబ్లీ స్థానాలు ఉండగా ఒక సీటు కూడా బలిసి కులస్తులకు కేటాయించకపోవడం విచారకరమని అన్నారు. కొంతమంది స్వార్థపర కాపు నాయకులు జగన్ వెంట ఉండటంతో వారిని పావులుగా వాడుకొని కాపులు, బలిజల మధ్య జగన్ చిచ్చు పెట్టారని ఆరోపించారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ నిధులు కేటాయించకుండా అలంకార ప్రాయం చేశారని ఆరోపించారు. కాపులతో కలిసి బలిజనలను మోసం చేశారని అన్నారు. రాష్ట్రంలో పది జిల్లాల్లో కాపు కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసి దాని ద్వారా ఏ ఒక్కరికి ప్రయోజనం చేకూర్చకుండా నీరుగార్చారని అన్నారు. రాను ఎన్నికల్లో కాపులు, బలిజలు బుద్ధి చెప్పాలని కోరారు.

ఆ రహదారి అభివృద్ధికి మోక్షం ఎప్పుడో?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఓలేరు గ్రామంలోని వెంకటరాజు నగర్ నుండి రేపల్లె వెళ్లేందుకు ప్రధాన రహదారి మార్గం ఎలాంటి అభివృద్ధి లేక ప్రయాణికులకు నరకం చూపిస్తుంది. గ్రామానికి దూరంగా ఉన్న వెంకటరాజు నగర్, తూర్పుపాలెం పూర్తిగా దళితవాడలు. ఈ రెండు దళితవాడల ప్రజలు రేపల్లె వెళ్లటానికి ప్రధాన మార్గం వెంకటరాజు నగర్, పేటేరు గ్రామాల మధ్యలోని డొంక రోడ్డును ఆశ్రయిస్తూ ఉంటారు. ఎన్నో ఏళ్లుగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఆ రెండు దళితవాడల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పూర్తిగా గుంటలు ఏర్పడి ఇరువైపులా చెట్లు పెరిగి సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రయాణానికి తీవ్ర ఆటంకంగా మారింది. రోడ్డు గుంటలకు తోడు ఇరువైపులా చెట్లు పెరగడంతో



పేటేరు నుండి ఓలేరు కు వెళ్లే రహదారి

రాకపోకలకు అసౌకర్యానికి గురవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆ రెండు గ్రామాలు దళితవాడల ప్రజలు సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఎప్పటి కప్పుడు అభివృద్ధి చెందుతాయని ఎదురుచూస్తున్నారు. అయినప్పటికీ నిరాశ మిగులుతుందని ఆయా గ్రామాల దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఈ రహదారిని తాము అభివృద్ధి చేస్తామంటే, తాము అభివృద్ధి చేస్తామని ఇరు పార్టీల నేతలు ప్రగల్భాలు పలకడం తప్ప గెలుపొందిన అనంతరం ఏ ఒక్కరు దీనిపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. ఈ రహదారి గుంతల మయంగా మారి చెట్లు పెరిగిపోవడంతో రేపల్లె వైపు వెళ్లడానికి పెనుమూడి మీదుగా చెరకు రావాల్సి ఉంది. దీంతో ప్రయాణ భారం అదనంగా మూడు కిలోమీటర్లపైగా వెచ్చించాల్సి వస్తుందని చెబుతున్నారు. ఉన్న రహదారిని అభివృద్ధి చేస్తే రెండు దళితవాడల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఈ రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సార్వత్రిక ఎన్నికల ను దృష్టిలో పెట్టుకొని, ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన మోడల్ కోడ్ అఫ్ కాండక్ట్ అమల్లో ఉన్న నేపథ్యంలో, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీస్ శాఖ తీసుకుంటున్న ముందస్తు చర్యల గురించి మరియు ఎలక్షన్ ముగిసే వరకు అభ్యర్థులు, నాయకులు ఏ విధంగా నడుచుకొని శాంతి భద్రతలకు సహకరించాలి అనే విషయం మీద జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పలు సూచనలు చేశారు.

సభలు సమావేశాల ఏర్పాట్ల కోసం నియమావళి

పార్టీ లేదా అభ్యర్థి స్థానిక పోలీస్ అధికారులకు ముందుగానే సభ నిర్వహించే ప్రదేశం, సమయాన్ని తెలియజేయాలి , సభ ఏర్పాటు విషయంలో నిషేధాత్మక లేక నిర్బంధాత్మక ఆదేశాలు ఉన్నాయా లేదా అనేది సరిచూసుకోవాలని, సభల్లో లౌడ్ స్పీకర్లు వినియోగించేందుకు ముందుగానే సంబంధిత అధికారికి లిఖితపూర్వకంగా అభ్యర్థన సమర్పించి అనుమతి పొందాలి , సమావేశాలు భగ్నం చేయడం లేదా మరో విధంగా శాంతిని భంగం కలిగిన విధంగా ప్రయత్నించే వ్యక్తులపై తప్పక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ర్యాలీలు నిర్వహించడానికి నియమావళి

ర్యాలీ నిర్వహించే పార్టీ లేదా అభ్యర్థి కార్యక్రమం ప్రారంభించే సమయం, ప్రదేశం, వెళ్లే మార్గం, ముగింపు సమయం, ప్రదేశం తదితర విషయాలను ముందుగానే నిశ్చయించుకోవాలి , దానిని అతిక్రమించకుండా కార్యక్రమం గురించి స్థానిక పోలీస్ అధికారులకు నిర్వాహకులు ముందుగానే తెలియజేసి ఊరేగింపు సాగే ప్రదేశాల్లో ఏవైనా నిర్బంధాత్మక ఆదేశాలు అమలులో ఉన్నాయా అనేది సరిచూసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు నిర్బంధాలను జాగ్రత్తగా అనుసరించాలి , అభ్యర్థులు వేరువేరు రాజకీయ పార్టీలు ఒకే మార్గంలో ఊరేగింపు తలపెట్టినప్పుడు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు తో సంప్రదింపులు జరపాలని, ఊరేగింపులో పాల్గొనే వ్యక్తులు ప్రమాదకర వస్తువులు వెంట తెచ్చుకోకుండా రాజకీయ పక్షాలు అభ్యర్థులు బాధ్యత వహించాలని, అలాంటి వస్తువులను అసాంఘిక శక్తులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని ఇతర రాజకీయ పార్టీల సభ్యుల, నాయకుల దిష్టిబొమ్మలను మోసుకెళ్లటం, దహనం చేయటం వ్యతిరేక ప్రదర్శన రూపాలను నిర్వహించకూడదని తెలిపారు.

సాధారణ ప్రవర్తన నియమావళి ఇలా..

ఇతర రాజకీయ పార్టీల నాయకులు ఓట్లను పొందడం కోసం ఇదివరకే ఉన్న విభేదాలను మరింత పెంచేలాగా పరస్పర విద్వేషాన్ని రగిల్చే విధంగా కులాలు, జాతులు మధ్య మతపరమైన, భాషా పరమైన స్థానిక పరమైన ఉద్రేకాలను కలిగించే ఏ విధమైన కార్యకలాపాలను ఏ పార్టీ అభ్యర్థులు నిర్వహించరాదని, ఓట్ల కోసం కుల మతపరమైన, భావాలపరంగా అభ్యర్థన చేయకూడదని, ఓటర్లకు లంచం ఇవ్వటం, బెదిరించటం, ప్రలోభాలకు గురి చేయడం, అసలు వ్యక్తులు బదులుగా ఇతరులను ఓటరుగా చేయటం చేయకూడదని, ఎన్నికల ప్రచారం కోసం మసీదులు, చర్చిలు, దేవాదాయాలు మరే ఇతర ఆరాధన ప్రదేశాలను, పాఠశాలలను వేదిక ఉపయోగించకూడదని తెలిపారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల లోపు ఖచ్చితమైన పర్మిషన్ లేకుండా పబ్లిక్ ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజలందరూ నిష్పక్షపాతంగా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని దీనికి కావాల్సిన ప్రతి విధమైన రక్షణ ఏర్పాట్లను పోలీస్ శాఖ తరపున శక్తి వంచన లేకుండా అందజేస్తామని ప్రజలు స్వేచ్ఛగా నిర్భయంగా తమ హక్కుని వినియోగించుకోవచ్చని తెలిపారు.



టిడిపి బిసి సెల్ సమావేశంలో రాష్ట్ర నాయకులు

'బీసీలను అణగదొక్కారు..'

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

టిడిపి పాలనలోనే బిసిలకు న్యాయం జరుగుతుందని టిడిపి బిసి సెల్ రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. బిసి సమస్యలపై జయహో బిసి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇసుకదర్శిలోని పర్చూరు ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో సదస్సు సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుంజి వెంకట్రావు, కార్యదర్శి కోడూరి శేష బ్రహ్మాచారి మాట్లాడారు. వైఎస్ జగన్ బిసిలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని అన్నారు. ఐదేళ్ల జగన్ మోహన్ రెడ్డి పాలనలో బీసీలను అణగదొక్కటం, అక్రమ కేసులు పెట్టించడం, హత్యలు చేయటం వంటివి చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో శాలివాహన సాధికార సంఘం సభ్యులు ఇందుర్తి ఏడుకొండలు, గౌడ సాధికారత కమిటీ కార్యదర్శి కాటూరి ప్రసాద్, అగ్నికుల క్షత్రియ కమిటీ కార్యదర్శి గొల్లపోతు వెంకటేశ్వర్లు, బాపట్ల పార్లమెంట్ రజక సాధికారత కమిటీ సభ్యులు పోలూరి సింగయ్య, తుమ్మలపెంట రాఘవయ్య, విప్పర్ల బాలకృష్ణ, సగర సాధికార కమిటీ సభ్యులు గండికోట వీరయ్య, వడ్డెర సాధికార కమిటీ సభ్యులు పల్లపు అంకమ్మరావు, నాయి బ్రాహ్మణ సాధికారిక సభ్యులు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, యాదవ సాధికార కమిటీ సభ్యులు నక్కల రాఘవ, బీసీ సెల్ పార్లమెంట్ కమిటీ కార్యదర్శి అన్నవరపు శ్రీనివాసరావు, శివరాత్రి శ్రీనివాసరావు, కూరపాటి జగన్, అద్దంకి రామ సుబ్బారావు, ఉప్పు గురవయ్య, గుంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు హేయమైన చర్య

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రజా సమస్యలు వెలికి తీసే జర్నలిస్టులపై దాడులు చేయటం హేయమైన చర్యని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయానికి విచ్చేసిన వైసిపి ఇన్చార్జి వరికూట్టి అశోక్ బాబు ఎన్నికల నిబంధనలు అమలులో ఉండగా ఎందుకు వచ్చారని ప్రశ్నించిన విలేకరిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఆయన అనుచరులు దాడికి పాల్పడిన ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. భారత దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఎన్నడు లేనివిధంగా వైసీపీ ప్రభుత్వ పాలనలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని అన్నారు. వైసిపి నాయకులు అక్రమంగా ఇసుక తరలించుకోవడమే కాక అందుకు సంబంధించి అధికారులపై వత్తిడి చేసి ట్రాక్టర్లను విడిపించుకునేందుకు వచ్చిన అశోక బాబును ప్రశ్నించినందుకు అతని అనుచరులు విలేకరిపై దాడికి పాల్పడటం సమంజసం కాదని అన్నారు. ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఇదే ఏడాది ఫిబ్రవరి 14న ప్రకాశం జిల్లాలో మైనింగ్



జర్నలిస్టులపై దాడులపై టిడిపి నిరసన

వ్యవహారాలపై వార్త ప్రచురించిన విలేకరిపై వైసిపి నాయకులు దాడి చేయడం, 18న రాప్తాడు సభలో మరో విలేకరిపై దాడి చేసి చిత్రహింసలు చేయటం, 20న కర్నూలు జిల్లాలో విలేకరిపై దాడి చేయడమే కాక పత్రిక కార్యాలయంపై దాడి చేసిన ఘటన జరిగాయని అన్నారు. జర్నలిస్టులపైనే కాక ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై వైసీపీ గుండాలు దాష్టికం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా వైసిపి ఇన్చార్జి అశోక్ బాబు నియోజకవర్గానికి రావడంతో ఈ దాడి ఘటనలు ప్రారంభమైనాయని ఆవేద వ్యక్తం చేశారు. విలేకరిపై దాడికి పాల్పడిన వ్యక్తులను పోలీసులు గుర్తించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బట్టు మల్లికార్జునరావు, వై కరుణ శ్రీనివాసరావు, కనపర్తి సుందర్రావు, ఎడ్ల జయశీలరావు, కుమారస్వామి, జి లెనిన్, ఆదిన బసవ పున్నయ్య, బిజెపి నాయకులు యకట్లీ బెగ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు శవన్‌ప్రాష్ పంపిణీ చేస్తున్న అంజమ్మ

చవన్ ప్రాష్‌తో వ్యాధులు దూరం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఆయుర్వేదం అందిస్తున్న చవన్ ప్రాష్‌ను విద్యార్థులు క్రమం తప్పకుండ తీసుకోవడం వలన సాధారణ వ్యాధుల నుండి రక్షణ కల్పించి రోగ నిరోధక శక్తిని పెంపొదిస్తుందని స్థానిక ఆయుర్వేద వైద్యశాల ఇంచార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గుర్రం అంజమ్మ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలోని ఎంపియుపి (ఏఏ) పాఠశాల విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంలో చవన్ ప్రాష్ విశిష్టతను గురించి పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. చిన్నతనం నుండే విద్యార్థులు చవన్ ప్రాష్ లేహ్యం తీసుకోవడం ద్వారా జ్ఞాపకశక్తిని పెంపొందించుకోని చదువులో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. పాఠశాల్లోని 150మంది విద్యార్థులకు చవన్ ప్రాష్ లేహ్యాన్ని డాక్టర్ అంజమ్మ పంపిణి చేశారు. కార్యక్రమంలో కొణిదెన ఆయుర్వేద వైద్యశాల కంపౌండర్ బొల్లాప్రగడ తనూజ, షేక్ ఖాజాబీ, హెచ్ఎం నెలకుర్తి ఆంజనేయులు, ఉపాధ్యాయులు ముప్వా సుబ్రమణ్యం, లెవీ జోసెఫ్ బాబు, సుబ్బారావు, శివపార్వతి, కుమారి పాల్గొన్నారు.



అగ్ని ప్రమాద బాధితులకు వంటసామాగ్రి బహుకరణ

బాధితుడికి రెడ్ క్రాస్ సాయం

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని మరుప్రోలు వారిపాలెం గ్రామంలో గత రాత్రి అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు మున్నం చిన కొండలురెడ్డి కుటుంబానికి రెడ్ క్రాస్ సొసైటీ తమ వంతు సహాయ సహకారాలు అందజేసింది. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ నారాయణ భట్టు, విపత్తు నిర్వహణ సభ్యులు డివి రమణబాబు, రెడ్ క్రాస్ సహకారంతో వంట సామాగ్రి, హైజీన్ కిట్, టార్పాలిన్ షీట్ గురువారం అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ఎంఇఓ సుధాకరరావు

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాల (సత్రంబడి) నందు పాఠశాల హెచ్ఎం ఇట్టా రామారావు అధ్యక్షతన భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులతో అంతర్జాతీయ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంఇఓ భూదాటి సుధాకరరావు మాట్లాడుతూ క్రోమోజోముల అసాధారణత వలన జన్మిస్తారని అన్నారు. వీరిని ప్రోత్స హిస్తే అభివృద్ధి చెందుతారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఇట్టా రామారావు సమకూర్చిన బహుమతులు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా, సిఆర్‌పీ రామకృష్ణ, ఆయా లక్ష్మి పాల్గొన్నారు.

పకడ్బందీగా పర్యవేక్షణ

- కలెక్టర్ దినేష్‌కుమార్
- కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సాధారణ ఎన్నికలు-2024 కోసం ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ (మానిటరింగ్) పకడ్బందీగా జరగాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ తో కలసి కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను సందర్శించి విజిల్, ఎక్స్‌పెండిచర్, స్వీప్, సువిధ సెల్ , మీడియా మానిటరింగ్ సెల్ వంటి విభాగాలను పరిశీలించారు. ఈ సంధర్భంగా జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్ మాట్లాడుతూ, సాధారణ ఎన్నికలు - 2024 కోసం ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ పూర్తి స్థాయిలో పనిచేయడం ప్రారంభమైందన్నారు. ఈ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సి-విజిల్, కంప్లైంట్ రిసెప్షన్ యూనిట్, 1950 కాల్ సెంటర్, ఫీల్డ్ మానిటరింగ్ యూనిట్, ఎంసిసి, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, పర్మిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వంటి అంశాలకు సంబంధించి 14 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ఠంగా కచ్చితంగా అమలు అయ్యేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సి- విజిల్ యాప్ లో మోడల్ కోడ్ ఉల్లంఘన పై ఫిర్యాదులను పంపవచ్చని తెలిపారు. పార్టీలకు చెందిన వారు మద్యం, నగదు, బహుమతులు వంటివి పంపిణీ చేసినా లైవ్ ఫోటో లు, వీడియో ల ద్వారా ఈ యాప్ ద్వారా ప్రజలు పిర్యాదులు చేయవచ్చన్నారు. . ఈ యాప్ లో పెట్టిన ఫిర్యాదులను 100 నిమిషాలలో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. దీంతో పాటు 1950 కాల్ సెంటర్ నెంబర్ కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అర్జున్ రావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి భరద్వాజ్, కలెక్టరేట్ ఎఒ శ్రీకాంత్ పాల్గొన్నారు.

దళితుడిపై పెత్తందారుల దాడి

- మురుగునీటిని అడ్డగించారని ఫిర్యాదు చేసినందుకే..
- బాధితుడిని పరామర్శించిన కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

త్రిపురాంతకం మండలంలోని ఎండూరివారిపాలెం గ్రామంలో కుల వివక్ష పడగ విప్పింది. ఆ గ్రామంలో పంచాయతీ నిధులతో నిర్మాణం చేపట్టిన రోడ్లపై నడవనియ్యకపోవడం, దళితులకు చెందిన మురుగు నీటిని ప్రవహించకుండా పెత్తందారులు అడ్డుకున్నారు. అందులో భాగంగా ఎండూరివారిపాలెం గ్రామానికి చెందిన దళితుల ఇళ్ల మురుగునీటిని పోనివ్వకుండా పెత్తందారులు బాసిబోయిన పేరయ్య, తోట గోవర్ధన్ అడ్డుకట్ట వేయడంతో దళితుడు యామర్తి త్రిపురాంజనేయులు గ్రామ పంచాయతీ అధికారికి సమస్యను తెలియజేశారు. ఆయన వచ్చి పరిశీలించి ఇది పంచాయతీకి చెందినదని ఈ విషయంలో ఎవరు గొడవ పడవద్దని, ఇరు వర్గాలకు సర్ది చెప్పి వెళ్లారు. అయితే బుధవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో బాసిబోయిన పేరయ్య, తోట గోవర్ధన్ మద్యం సేవించి 'మాపై పంచాయతీ అధికారికి ఫిర్యాదు ఇచ్చే మొనగాళ్లా..' అంటూ యామర్తి త్రిపురాంజనేయులు ఇంటి స్థలంలోనికి వచ్చి ఆయనను చొక్కా పట్టుకొని లాక్కొని వెళ్లి కాళ్లతో తన్ని, చెప్పులతో కొట్టి దాడి చేశారు. హార్ట్ పేషెంట్ అయిన త్రిపురాంజనేయులు దెబ్బలకు తాళలేక పడిపోయాడు. ఆయనను మెరుగైన వైద్యం నిమిత్తం యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు 108 అంబులెన్స్‌లో తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. పెత్తందారుల చేతులలో దెబ్బలు తిని చికిత్స పొందుతున్న త్రిపురాంజనేయులును గురువారం కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జువ్వాజి రాజు, బి రఘురాం, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవెండ్ల శ్రీనివాస్, సిఐటియూ నాయకులు లాభాను, దళిత సంఘాల నాయకులు పరామర్శించారు. ఈ సంధర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురాం మాట్లాడుతూ దళితుడైన త్రిపురాంజనేయులుపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కెవిపిఎస్ ఆధ్వర్యంలో అన్ని సంఘాల సహకారంతో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బ్యారెన్ అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలి

- నోటీసులు అంటించిన అధికారులు
- ఆ నోటీసు చించివేసిన ఆక్రమణదారుడు



నోటీస్ అంటిస్తున్న కార్యదర్శి సాంబయ్య

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని కాకుటూరువారిపాలెం గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి.. పంచాయతీ అనుమతులు సైతం లేకుండా చేపట్టిన పొగాకు బ్యారెన్ అక్రమ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని అధికారులు బ్యారెన్ వద్ద నోటీసు అంటించారు. ప్రజాశక్తి టాబ్లాయిడ్‌లో గురువారం బ్యారెన్ నిర్మాణం ఆపాలంటూ.. ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. సదరు గ్రామ ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి పి.సాం బయ్య గ్రామానికి వెళ్లి ఆక్రమణదారులతో మాట్లాడారు. వెంటనే పనులు నిలిపివేయాలని చెప్పారు. పని ప్రదేశంలో గోడకు నోటీసును అంటించి వెళ్లారు. అధికారులున్నప్పుడు తలూపిన ఆక్రమణదారుడు వారు అటు వెళ్లడమే తరువాయి.. గోడకు అంటించిన నోటీసులు చించిపడేసి.. పని ప్రారంభించాలని బేల్దారి కూలీలను పురమాయించాడు. నోటీస్ చించివేసి పనులు చేపడుతున్న విషయాన్ని గ్రామస్తులు పలువురు ఎంపీడీఓ పి సుబ్రహ్మణ్యం, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కమిషనర్‌కు సిఐటియు నేతల వినతి



కమిషనర్‌కు అర్జీ ఇస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగర పాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ కోరారు. ఈ మేరకు ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ జశ్వంత్‌రావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి కానుక రూ.1000లు వెంటనే అమలు చేయాలని, కార్మికులకి చెల్లించాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు క్లెయిమ్ పేరుతో రెండు లక్షల రూపాయలు ముగ్గురు కార్మికులకి వెంటనే ఇవ్వాలన్నారు. ఒంగోలు నగరంలో పెద్ద లారీలు, వాహనాలు గత పది రోజుల నుండి రిపేర్లతో తోటి కార్మికులు, ప్రజలను ఇబ్బంది పడుతున్నారన్నారు. కోవిడ్ కార్మికులు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు, కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, యూనియన్ నగర్ నాయకులు టి విజయమ్మ, ఎద్దు రవి కుమార్, కాకుమాను వెంకటేశ్వర్లు, ఎం బాబు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ మనందరి బాధ్యత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పర్యావరణ పరిరక్షణ కాలుష్య నిర్మూలన కోసం అడవులను సమిష్టిగా సంరక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి వీర భద్రా చారి పేర్కొన్నారు. గురువారం సంస్థ కార్యాలయంలో ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకతి, పర్యావరణంలో భాగమైన అడవుల సంరక్షణలో ప్రభుత్వాల వైఫల్యంతో అడవుల నరికివేత, ఆక్రమణలు, కాలుష్య కారక పరిశ్రమలు ఏర్పాటుతో వాటి విస్తీర్ణం తరిగి పోయి వాతావరణ అసమతుల్యత ఏర్పడుతుందన్నారు. భావితరాలకు అడవుల ప్రాధాన్యత, ప్రాముఖ్యతను తెలియజేసి,విరివిగా మొక్కలు పెంచే విధంగా చైతన్య పరచేందుకు అటవీ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జి.అమన్, అజయ్, భువన, ప్రసాద్, అనూరాధ, రాఘవ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలలో ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయం వద్దు..

కలెక్టర్ రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలలో ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయం ఉండరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో గురు వారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఎన్నికల ప్రవర్తన నియ మావళి అమలులో ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగులు మరింత అప్రమత్తంగా వ్యవహరిం చాలని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఏ రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల లోనైనా ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నట్లు ఫిర్యాదులు వస్తే తక్షణమే వారిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు.ఎన్నికల విధుల నుంచి ఉద్యోగులకు ఎలాంటి మినహాయింపు లేదన్నారు. అత్యవసర సేవలు అందించే వైద్య ఆరోగ్యశాఖ, పశుసంవర్ధక, అగ్నిమాపక శాఖలకు మాత్రమే మినహాయింపులు ఉన్నాయన్నారు. మినహాయింపులు కోరుతూ 875 దరఖాస్తులు వచ్చాయన్నారు. వారి దరఖాస్తుల పరిశీలనకు జిల్లా రెవిన్యూ అధికారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డీఈవో, డి ఎల్ డి వో లను నియమిస్తున్నట్లు ప్రకటించారు. సధరు అధికారులు ధ్రువీకరించిన వారికి మాత్రమే మినహాయింపులు ఉంటాయని, లేకుంటే ఎన్నికల విధులు ఖచ్చితంగా నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు.

ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక పోలింగ్ కేంద్రంలో పూర్తిగా విభిన్న ప్రతిభావంతులనే నియమించాలని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఉన్నాయని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ తెలిపారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు వినూత్న రీతిలో ఆహ్వానం

- మొక్కలు నాటించిన యాజమాన్యం..
- సస్పెన్షన్ ముగిసిన విద్యార్థులు తిరిగి తరగతులకి హాజరు..



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల లో అరుదైన ఘటన చోటుచేసుకుంది. తిరిగి తరగతులకు హాజరవుతున్న వైద్య విద్యార్థులకి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ఏడుకొండలరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటించి.. ఆహ్వానించారు. మంచి సంప్రదాయ పద్ధతులు అందరినీ కలిసిమెలసి వుండేలా చేస్తాయని ఇలా ఏర్పాటు చేశామని ఏడుకొండలరావు చెప్పారు. ప్రతి ఒక్కరూ మంచి భవిష్యత్ వైపు అడుగులు వేయాలని విద్యార్థులకి సూచించారు. కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.తిరుమల రావు, సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ హనుమంత రావు, డాక్టర్ సుధాకర్‌బాబు, ఏఆర్ఎంఒ డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయానికి (ట్రిపుల్ ఐటి) సంబంధించిన కొత్త బస్సును కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ గురువారం ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ పటేల్, డీన్స్ ఎం. రూపాస్ కుమార్, సురేష్‌బాబు, కోఆర్డినేటర్ డాక్టర్ డి. రవి చంద్, సిబ్బంది పాల్గొన్నారు.